క్లుప్తంగా

బాలలకు ధార్మిక శిక్షణా తరగతులు

కడప కల్చరల్ : సనాతన ధర్మ పరిరక్షణ సేవలో భాగంగా ఈనెల 7 నుంచి నగరానికి చెందిన బాలబాలికలకు ధార్మిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కడప నగరం జయనగర్ కాలనీకి చెందిన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం చైర్మన్ వి.సీతారామయ్య తెలిపారు. ప్రతి ఆదివారం 5–15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు ఉచితంగా ఉదయం 9.30 నుంచి 11.00 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. బాలలకు శ్లోకాలు, పద్యాలు, వ్యక్తిత్వ వికాస కథలు, భగవద్గీత శ్లోకాలు, పురాణ ఇతిహాసాలు, ఆటల ద్వారా ఏకాగ్రత తదితర అంశాలు నేర్పేందుకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యం నుంచే వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మికత, సత్యం, భారతీయ సంస్కృతి, మానవతా విలువలను అభివృద్ధి చేసేందుకు ఈ తరగతులు ఉపయోగపడగలవన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లకు శిక్షణా తరగతులు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 99662 65101, 8328 209158 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

7న డీఎస్సీ, గ్రూపు–2లపై ఉచిత అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తేజ పెట్రోల్ బంక్ పక్కన గల శంకర్ రెడ్డిస్ సాయి బాలాజీ కోచింగ్ సెంటర్‌లో 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు డీఎస్సీ(ఎస్జీటి, ఎస్), గ్రూపు–2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎ. శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99667 87371, 88861 42609 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు ఏపీ దళితమిత్ర ఆవిర్భావ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీ దళితమిత్ర సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం 7వ ఆవిర్భావ సభను ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని దళిత మిత్ర ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో సభకు సంబంధించి కరపత్రాలను విడుదలజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రాజకీయ చైతన్యమే మన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మురహరి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉటుకూరు వీరయ్య, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పసుపుల మనోహర్, కంచుపాటి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని కడప ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్న వేతనంలో కోత కోస్తున్న విక్టర్ అసోసియేషన్ అధినేత, కాంట్రాక్టర్ వాసుదేవకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్వీపర్లకు రూ. 11,202 వేతనం ఇవ్వాల్సి ఉండగా, రూ. 9,100 ఇచ్చి దోచుకోవడమే కాకుండా తిరిగి రూ. 3000 వెనక్కి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా కట్టడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇలాగే చేస్తున్నాడని విమర్శించారు. బస్సులను శుభ్రపరుస్తున్న కార్మికులకు రూ. 6 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రైతు బజార్ సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప రైతు బజార్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైతు బజార్‌లో ఆర్‌సీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు బజార్ అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులు దేనికోసం ఉపయోగించారో తెలపాలన్నారు. రైతు బజార్లో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తోందన్నారు. వర్షం వస్తే పైకప్పు రేకుల గుండా మొత్తం వర్షపు నీరు షాపుల్లో పడుతున్నదని, దీనివల్ల చాలా నష్టపోతున్నామని కొంతమంది రైతులు సమస్యలు మా దృష్టికి తీసుకొచ్చారని వీటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా, కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మీదేవి, చాపల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులందరికీ ఇన్‌స్టంట్ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ కోరారు. శుక్రవారం వైవీయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదివిన విద్యార్థులకు సంబంధించి 4వ సెమిస్టర్‌కు మాత్రమే ఇన్‌స్టంట్ అవకాశం ఇచ్చారని, అన్ని పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. అనంతరం వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి డా. ఎస్. ఈశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, యశ్వంత్, ఆదిత్య, సుశాంత్, విశాల్, గౌతమ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



వైవీయూ పరీక్షల నియంత్రణాధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించడం కోసమే రెవల్యూషనరీ విద్యార్థి సంఘం ఏర్పాటయిందని ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి అన్నారు. ఆర్ఎస్‌యూ 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడప నగరంలోని ప్రకాష్‌నగర్ బాలుర హాస్టల్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలే ఊపిరిగా ఆర్ఎస్‌యూ ముందుకు సాగుతోందన్నారు. రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు కొమ్ముకాస్తోందన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అన్నారు.

కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ పురోభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని కోరారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు సందీప్‌కుమార్, జస్వంత్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో కలిసి ఆర్ఎస్‌యూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైవీయూ బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఈడీ, ఎంఈడీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలలో మొదలయ్యాయి. పరీక్షలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి కడపలోని నాగార్జున కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్. ఈశ్వర్ రెడ్డి కడపలోని నాలుగు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. నిర్వహణలో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కట్టుదిట్టంగా నిర్వహించాలని పరీక్షల అధికారులకు వారు సూచించారు. ప్రతి కేంద్రంలో విశ్వవిద్యాలయం నుంచి అబ్జర్వర్లను నియమించగా విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ కమలాపురం, ప్రొద్దుటూరు, బద్వేలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. అలానే వైవీయూలో జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను ఆచార్య రఘునాథరెడ్డి తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించండి

– ఆత్మ పీడీ విజయలక్ష్మి

వేముల : పంటల సాగులో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని గొందిపల్లె గ్రామంలో శుక్రవారం పత్తి, వేరుశెనగ, చీనీ, ఉల్లి, కంది పంటలను కేవీకే శాస్త్రవేత్త శిల్పకల, ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ, వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగడం వల్ల రైతులకు పంటల సాగులో ఆదాయం ఉంటుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయే తప్ప ఆశించిన మేర దిగుబడులు అందడం లేదని రైతులకు వివరించారు.

అనంతరం కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పత్తిపంటలో సోకిన తెల్లదోమ, పచ్చదోమ నివారణకు డైయాబెంజూరాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి లేదా థైయోమిథాక్సిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి లేదా ప్లోనికామిడ్ 0.3మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. అనంతరం ఆత్మ డీపీడీ పద్మలత మాట్లాడుతూ బత్తాయిలో బోరన్ లోపం వల్ల కాయలు పగలడం, ఆకులు ముదురుగా అయి గుంతలు పడుతున్నాయన్నారు. బోరన్ లోపం నివారణకు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే వీఏఏ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో ఆర్థికవ్యవస్థ పురోగతి

– ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: నూతన సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పురోగతికి బాటలు వేసుకోవచ్చని, ఉద్యోగపరంగా కొత్త అవకాశాలను సృష్టించుకోవచ్చని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ‘ఆధునిక సాంకేతికత హరిత ఆర్థికవ్యవస్థ’ అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశప్రగతి, సుస్థిరాభివృద్ధిని సాధించడంలో సాంకేతిక వినియోగం గురించి వివరించారు. ముఖ్యవక్తలుగా సింగపూర్‌కు చెందిన అలాన్ టెక్నాలజీ డైరెక్టర్ కె. పార్వతి, యూఎస్ఏలోని కాలిఫోర్నియా నుంచి మిస్టర్ పార్కర్, బోస్టన్ నుంచి కె. తేజస్వినిలు ముఖ్యవక్తలుగా వర్చువల్ విధానంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల గురించి, గ్రీన్ ఎకానమీ, పునరుత్పాదకత వనరుల గురించి వివరించారు. కృత్రిమ మేధస్సు గురించి, హరిత ఆర్థికవ్యవస్థను రూపొందించడంలో సాంకేతికత పాత్రను వివరించారు. వాటర్ మేనేజ్‌మెంట్, వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ జి. విజయలక్ష్మి, కో కన్వీనర్ డా. కె.వి.కృష్ణవేణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. గురుమోహన్‌రెడ్డి, డా. పి.శచీదేవి, డా. ప్రకాష్ నారాయణ రెడ్డి, డా. కె. శాలిని తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం 6 నుంచి 14 సంవత్సరాల్లోపు బాలబాలికలు కచ్చితంగా చదువుకోవాలని బడికిపోదాం అనే కార్యక్రమాన్ని జూన్ 13 నుంచి జులై 12వ తేదీ వరకు నిర్వహిస్తోందని కడప ఎంఈఓలు దుద్దికుంట గంగిరెడ్డి, షేక్ ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం కాగితాలపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులతో కడప ఎంఈఓలు, విద్యార్థులతో కలిసి మనం బడికిపోదాం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాఠశాల నుంచి మనం బడికిపోదాం నినాదంతో ఐటిఐ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ బడి ఈడు వయసున్న పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. సీఆర్పీలంతా బడిఈడు పిల్లల కోసం సర్వే చేసి బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అలీ అక్బర్, రాజశేఖర్, రమాదేవి, జాహీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించండి

– జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారుడు సీటుబెల్ట్ పెట్టుకోవాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలియజేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి ఆదేశానుసారంగా శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయసేవా సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి, సురక్షితంగా గమ్యాన్ని చేరండి, హెల్మెట్ వాడకం సురక్షితమన్నారు. హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. మనల్ని, మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలన్నారు. మనం హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా వుండాలన్నారు. ఐ.ఎస్.ఐ మార్క్ గల నాణ్యమైన హెల్మెట్లను వాడాలన్నారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురుషుల, మహిళల కేంద్రకారాగారాల సూపరింటెండెంట్‌లు, డిస్ట్రిక్ సబ్ జైల్ ఆఫీసర్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

వడ్డెరలను అన్నివిధాలా ఆదుకుంటాం

– ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వడ్డెర సామాజిక వర్గానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఐఎంఏ హాలులో వడ్డెర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత గురువారం మృతి చెందిన వడ్డెర సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గొడ్డలిగల రామచంద్రయ్య ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్నికలలో తమకు సహకరించిన వడ్డెర్లను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు బత్తల లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు జి రమణయ్య కార్యదర్శి, చంద్రగిరి నారాయణ, నాయకులు బత్తల జానకిరామ్, గంప వీరయ్య గోగుల శ్రీనివాసులు వెంకటసుబ్బయ్య, రాయచోటి రామకృష్ణ, మంజుల సుబ్బరాయుడు బత్తల శ్రీనివాసులు గోపి కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

సమస్యలు పరిష్కరిస్తాం

కడప రూరల్ : కడప నగర ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా తమ దృష్టికి వచ్చిన నగర శివార్లలోని దండు, వైఎస్సార్ కాలనీలో స్మశాన వాటికలు, నకాష్ ప్రాంతంలోగల స్మశాన వాటికలో నీరు నిలవడం, 34, 35 డివిజన్లలో దోబీఘాట్ సమస్యతోపాటు మిగతా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు సూచనలు చేశామన్నారు. అలాగే భూ కబ్జాలు అరికడతామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. రాత్రి అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

వల్లూరు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కడపలోని వన్ స్టాప్ సెంటర్ అడ్వకేట్ ఉమ తెలిపారు. మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు అమలులో వున్న ఇండియన్ పీనల్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహితగా మార్చిందన్నారు. ఇందులోని నూతన చట్టాలను గురించి అవగాహన కలిగి వుండాలన్నారు. మహిళలు, పిల్లలు తమ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, పోలీస్ స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలను గురించి అవగాహన కల్పించారు. జీరో ఎఫ్ఐఆర్, 1098, 181 ద్వారా ఫిర్యాదు చేయడం, బాల్య వివాహాలు, పిల్లలు, మహిళలు వారు చదువుకునే చోట, పని చేసే చోట తోటి వారితో ఎదర్కొనే సమస్యలు, వాటి పరిష్కారాలను గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే వారు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నూతన చట్టాలను గురించి అవగాహన పెంపొందించుకుని, అవసరమైనప్పుడు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో వసంతభాయి తెలిపారు. నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు హాజరయ్యారు.



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడ్వకేట్ ఉమ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

చెన్నూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరుంధతినగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే భోజనానికి ముందు చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. గ్రామంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి ఫ్రైడే డ్రై డే గురించి వివరించారు. సీజన్లో వచ్చే డయేరియా, డెంగ్యూ, మలేరియా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ మనోరమ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఏఎంఓ వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ రిబక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



చెన్నూరులో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

డయేరియాపై విద్యార్థులకు అవగాహన

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నీసాబేగం విద్యార్థులకు డయేరియాను ఎలా అరికట్టాల అనే విషయంపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత మన చుట్టూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబా ఫక్రుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాన్ని తిప్పి కొడదాం

కడప ఎడ్యుకేషన్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టి కార్మిక హక్కుల సాధనకై ఉద్యమించాలని యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్ఎస్పీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1,2 తేదీలలో తమిళనాడు రాష్ట్రం సేలం పట్టణంలో జరిగే యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు వెంకటేష్, భాస్కర్, నరసింహులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



పదోన్నతి పొందిన శ్రీకాంతను సన్మానిస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2గా పనిచేస్తున్న శ్రీకాంత నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆమె సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈక్రమంలో శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి ఛాంబర్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, హెడ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్‌ను పాఠశాలలకు పంపిణీ చేయాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్యకు సంబంధించి 2024–25 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్‌ను కడపజిల్లా ఉమ్మడి పరీక్షల మండలి(డీసీఈబీ) ద్వారా ముద్రించి అన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ సకాలంలో పాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా ముద్రించి పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్, నాయకులు వెంకటరమణ, గంగాధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపలక్ష్మీపూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చాముండేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విశేషంగా అమ్మవారి మూలవిరాట్‌ను దీపాలతో అలంకరించి దీపలక్ష్మీ పూజ, ధనలక్ష్మీ పూజ నిర్వహించి దశవిధ హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజించారు.